

# రాదారి బండ్లు ★ కులపతి అడివి బాపిరాజు

నా చిన్నతనంలో మా అక్కయ్య వివాహానికి మావూరునుంచి 20 మైళ్ళ దూరంలోవున్న ఓ గ్రామానికి తరలివెడుతున్నాము. రెండెడ్ల బండ్లు యాభై మా ప్రయాణానికి సిద్ధం అయ్యాయి. పెందరకాడే భోజనాలుచేసి బండ్లెక్కాము.

బండ్లఎద్దులుఒంగోలుజతలు. కైలాస పర్వత శిఖరాలులా, నంది శృంగంలులా, ప్రతి బండికీ వెలుపలా, దాపలా ఉన్నాయి. కొమ్ములకు వల్లె తాళ్ళు, నుదురున అలంకారపు పట్టీలు, మెడలలో గంటలు, చిన్నమువ్వ లాకుల పట్టీలు అల్లియున్న బళ్ళ, వెదురుచాపలు, గొంగళీలు, కట్టె గూడులు. కూర్చునేందుకు మొదట వట్టి గడ్డి, ఆపైన చాప, పైన పరుపులో, తివాసిలో! బళ్ళుసాగాయి. దాపటి ఎద్దులకు పెద్ద గంటలు, వెలుపల ఎద్దులకు చిన్న గంటలు, మంద్ర పంచమ స్వరాలూ, శృతికలిపి రాగాలాపన చేస్తున్నాయి. మువ్వలు తాళాలు వేస్తున్నాయి.

ఈవలావల వరిచేలు. గట్లపైన కందిమొక్కల బారులు, ఆ వెన్నెల నిండిన రాత్రివేళ ఈ బళ్ళబారు ప్రయాణం! చేలు ఇంకా మేలుకునే ఉన్నాయి. కీచురాయిలు ఏవో గీతాలు ఆలాపిస్తున్నాయి. అప్పుడే కోతలు సాగుతున్నాయి. చిన్న పక్షులు కోతలై కువ్వులు వేసి మారుస్తున్నారు. ఘూరుస్తూ, ఆ కర్షకులు గొంతెత్తి ఏవో తియ్యని పల్లెటూరు పదాలు [illegible]యిలో పాడుకుంటున్నారు. రోడ్డుప్రక్కనవున్న మురుగు కాలవలలో కలవపువ్వులు చంద్రకిరణాలు తమపై ప్రసరిస్తూ ఉండగా, భక్తితో ముకుళితముఖుని నిలుచుని ఉన్నాయి. మా రాదారి బళ్ళు సాగుతున్నాయి.

ఇంతలో బళ్ళకు, బళ్ళకు పందాలు వచ్చాయి. అప్పట రాచబాట కొంచెం వెడల్పుగా ఉన్నది. వెనుక బండివాడొకడు తన బండిని ముందర బళ్ళని తప్పించి, ముందుకుపోయి తన బండిని మొనగాడిబండిని చేయాలని ఆసించాడు. తక్కిన బండ్లు వూరుకుంటాయా ? అన్ని బండ్లను ఉరకలెత్తించటం సాగించారు. బండివాళ్ళు హై, హై, వహ్వా, డిడిడే నీ గంటలు వూడిపోను ముందుకు నడే!'' అనే కేకలతో బండివాళ్ళను, ఎద్దులను అదలించి, కొరడాలు ఫెళ్ళుమనిపిస్తూ తోకలు మెలిపెట్టుతూ, బళ్ళను దౌడు తీస్తున్నారు. అంతవరకు బండి కుదుపు, వుయ్యాల వూపు, బండిగంటల మ్రోత, లాలిపాటలు కాగా, మొగవారూ, ఆడవారూ, చిన్న బిడ్డలు, హాయిగా నిదుర కూరి మైమరచి వున్నారు. ఈ గడబిడకు ఎవరి బళ్ళు వాళ్ళు చటుక్కున లేచారు. బళ్ళవాళ్ళకే కాకుండా బండిలో వాళ్ళకు కూడా హుషారెత్తింది. ''మనబండిముందర పోనివ్వోయ్, మన బండి ముందు పోనివ్వోయ్''అని పంతాలు సాగించారు. ఇలా సాగింది మా ప్రయాణం. తెల్లవారేసరికి ఓ వూరు దగ్గరకు చేరుకున్నాం.

ఆ వూరు చెరువు గట్టున మా బండ్లన్నీ విప్పారు. రాత్రే వంటచేసి, ఒక బండిలో ప్రత్యేకంగా ఓ గుండిగ అన్నం ఆవకాయ, దప్పళం పులుసు, కందిపొడి, పెరుగు, పేరిననెయ్యి మొదలైన వస్తువులు పెళ్ళిపెద్దలు తీసుకొచ్చి వుండటంచేత చంటిపిల్లలకు, బళ్ళవాళ్ళకు చద్దిభోజనాలు పెట్టారు. పెద్దలు చెరువులో స్నానాలు చేసి, సంధ్యా వందనాలు వార్చుకుంటున్నారు. జపాలు కానిస్తున్నారు. ఇంతట్లో బొబ్బో, బొబ్బో అంటూ బాకలు వైతాళికులుకాగా, హోంటుంబోం అంటూ బోయీలు పాట పాడుతూ, వుండగా, పెళ్ళి కొడుకు పల్లకీ చక్కా వచ్చింది. తెల్లవారగట్ల బయలు దేరిన పల్లకీ యీవిడిదీ దగ్గర మమ్మల్ని కలుసుకుంది.

మకాం చేసింది చెరువుగట్టో, కాలువగట్టో అయితే, ఆ దృశ్యం ఎంత అందంగా ఉండేది. గట్టంతా బండ్లతో, విప్పివేసిన ఎద్దులతో, అటూయిటూ తిరిగే మనుష్యులతో చెట్లతో, తోపులతో, నిండి వుంటుంది. అవన్నీ కమలాలలా, కలువలలా వికసించివున్న ఆ చెరువు నీటిలో ఆ ఏటి ప్రవాహంలో ఆ కాలువ జాలులో ప్రతిఫలిస్తూ వుంటాయి.

ఆలాంటిసమయంలో చద్ది అన్నము తినడమూ సరదాగానే వుండేది. కందిపొడుం, ఆవకాయ, గోంగూరపచ్చడి, ఘుమఘుమలాడే నెయ్యి, పెరుగు తినడానికే పెద్దవాళ్ళు కక్కుర్తి పడేవాళ్ళు.



"పిలుపు" —చిత్రకారుడు: వి. వి. టోంపే

ఈ పెళ్ళిళ్ళకు ఎంత గొప్పవాళ్ళయితే, అన్ని ఎక్కువ బళ్ళు కడతారు. మా తాలూకాలో ఒక గొప్ప భూస్వామి పెళ్ళికి వెయ్యి ఎకరాల మాగాణి కలిగిన మగపెళ్ళివారు అయిదువందల రెండెడ్ల బళ్ళు కట్టుకు వచ్చారు.

ఆడపెళ్ళివారు పెళ్ళిజరిగేటంతకాలమూ, ఎద్దులకు మంచి మేతా, గడ్డీ గాదమూ, అన్నీ చక్కగా సరఫరా చెయ్యాలి. బళ్ళవాళ్ళకు భోజనం తోపాటు మంచి పొగాకు అందియ్యాలి ఆడపెళ్ళివారు.

వేసవి కాలంలో రాత్రిళ్ళూ, ఉదయాస్తమానాలు, చల్లబడిన కాలంలోనూ రాదారిబళ్ళ ప్రయాణాలు సాగేవి. శీతాకాలపు పగలంతా ప్రయాణం సాగుతూ వుండేది.

మెరక వూళ్ళల్లో నూతుల దగ్గర మకాములూ మజిలీలూ. దారివెంట సత్రములు ఉండేవి. పూర్వ కాలంలో వైద్యశాలలూ, పశువైద్యశాలలూ వుండేవి.

చుట్టాలను చూడాలన్నా, ఆడపడుచులను పుట్టింటికితీసుకురావాలన్నా, అత్తింటికికోడలిని పంపాలన్నా, యిలా యీ రెండెడ్లబండ్ల ప్రయాణమే పూర్వం. చిన్నబిడ్డ తల్లి అయితే, మేనా, సవారీ ఎక్కి, ఆవిడ బళ్ళతో ప్రయాణం చేసేది.

పూర్వం చెన్నపట్నం కంపెనీ దొరలతో పని వున్నప్పుడూ, రైళ్ళు రాని క్రితం, రాయలసీమ నుంచీ, కోస్తా జిల్లాలనుంచి ఈ రాదారిబళ్ళ ప్రయాణాలే. కోస్తా జిల్లాలవారు కొందరు ఓడ లెక్కి చెన్నపట్నం వచ్చేవారుట.

భద్రాచలం శ్రీసీతారామచంద్రకల్యాణమహోత్సవానికి పడవలమీద వెళ్ళేవారు వెడుతూ ఉండగా, దేశ దేశాలనుండీ రాదారి బళ్ళమీదనే యాత్రలు సాగించుకు వచ్చేవారు. కోస్తా జిల్లాలవారు మొన్నమొన్నటి వరకూ ఎర్రబాలెం దగ్గర రెండెడ్ల రాదారిబండ్ల మీదనే ప్రయాణాలు.

శివరాత్రి మహోత్సవానికి శ్రీశైలం వెళ్ళాలన్నా చాలాదూరం అలాగే ప్రయాణాలు సాగిస్తారు. యీనాటికీ. భద్రాయి, కదిరీ, పెంచెలకోన, అహోబిలం, యాదగిరి నృసింహదేవర్ల తిరునాళ్ళకు యీనాటికీ యీలాంటి ప్రయాణాలే.

కోటప్పకొండ, శివరాత్రి తిరునాళ్ళకు కొండవీడు, పల్నాడు, వినుకొండ, అద్దంకి, వంగోలు సీమలనుండి పల్లె పల్లెలలో తిరునాళ్ళు ఇంకా కొన్ని నెలలు వుందనగానే ఎద్దులను తయారు చేస్తారు. మంచి మేతా, రోజూ సరియైన పరిశ్రమలతో అపతరించి బసవేశ్వరులులా సిద్ధం అవుతాయిఎద్లు. ప్రభలు రాతిచక్రాల బళ్ళమీద కడతారు. తిరునాళ్ళకు ముందుగా సరిగ్గా ఉత్సవానికి కోటప్పకొండ ఎల్లమంద గ్రామం చేరుకుందుకు వీలుగా గ్రామం, గ్రామం అంతా బయలుదేరుతుంది. ముందు మొనగాడి గిత్తలు మేరు పర్వత శిఖరాలులా, వెలిగిపోతూ ఉండగా, గంగిడోళ్ళు ఆడించుకుంటూ, తలలు తిప్పుకుంటూ అలంకారాలు, గంటలూ, మువ్వలూ, మహోగానం చేస్తూ వుండగా, మూపురాలు పాలసముద్ర మహావీచికలులా పొంగుతూ వుండగా, జరీపువ్వుల పచ్చడాలు వీపులను అలంకరించి వుండగా, బయలుదేరుతాయి.నాలుగూ, ఎనిమిది జతలు కూడా కడతారు. ఆ ప్రభలకు వెనుక,ఆవూరిరాదారిబళ్ళన్నీ బయలుదేరుతాయి. మకాములు చేసుకుంటూ కోటప్పకొండ చేరుతాయి. ఆ కొండమీదనుండి ఈ రాదారిబండ్ల విడిదెలుచూస్తే ఒకమహాచిత్రంలా ఆ బళ్ళూ, ఆ ప్రభలూ, ఆ జనమూ ప్రత్యక్షమవుతారు.

ఏ వివాహానికి వెళ్ళినా, ఏ తిరునాళ్ళకు వెళ్ళినా, ఏ వర్తకానికి బేహారమయినా, ఈ రాదారిబండ్ల విడిదే విడిదిప్రదేశాలు ఏవో ఆనందానుభూతితో నిండివుంటాయి. చెరువులు, కాల్వలూ, నదులు బావులు, సత్రాలు తోపులు, మజిలీలై , విడుదులై, వైరస్యవంతా లవుతాయి.

మెరక వూళ్ళల్లో చెరువులు, కొండవాగులు, బావులూ, గోదావరి జిల్లాలో నల్లచెరువు, తెలంగాణా పాకాలచెరువు, పాలంపేట చెరువు, రాయలసీమలో రాయసముద్రమూ,బుక్కపట్నంచెరువూ అలాంటి మహత్తరమయిన చెరువు గట్టున మకాములు,

పల్లపు వూళ్ళల్లో చెరువులూ, కాల్వగట్లలూ! చెరువులుఎండినా, వాగులు రాకపోయినా, ప్రక్కనే స్వచ్ఛమయిన పాతాళగంగలు ప్రవహించే బావులుంటాయి.

ఏ కృష్ణ ఒడ్డునో, గోదావరి తీరాన్నో, ప్రయాణాలయితే, ఎక్కడ విడిది చేయకూడదు ? ఈ రాదారిబండ్ల ప్రయాణాలు, ఆ విడుదులు, నాటక కావ్యాలే అవుతాయి. ఎంత కొత్తవారు కలుసుకున్నా యాత్రాస్నేహాలుద్భవిస్తాయి. కాశీమజిలీల కథలు, కథాసరిత్సాగరం, కథలు చెప్పుకుంటారు. యువకుల జీవితాలలో ప్రయాణ సంఘటనలు వెన్నెలలు ప్రసరించి పోతూవుంటాయి.

మోటార్లూ, రైళ్ళూ, బస్సులూ, లారీలు టాక్సీలు వచ్చిన ఈ నవ్యయుగంలో కూడా పల్లెటూర్లలో తెల్లటి మేఘాలులా, వెండి కొండల్లా, ఎద్దులు కట్టిన రెండెడ్లబండ్లే గ్రామాలకు ప్రాణం. పొలాలకు ఎరువులు వేసేవి రెండెడ్లబండ్లు. పొలం నుంచి పంట,గడ్డి యింటికి తీసుకువచ్చేవి రెండెడ్ల బండ్లు, వూరు వూరుకూ ప్రయాణం, రెండెడ్ల

బండ్లు.ఎంత చిన్న వ్యవసాయదారుడైనా, ఒక్క చిన్నబండయినా వుండితీరాలి. గూడు కట్టకుండా పొలం చేసేబండీ, గూడు కట్టగానే ప్రయాణం బండీ అవుతుంది. పల్లెటూరికి వచ్చే సామానులు పల్లెటూరు నుండి వెళ్లే సామానులు, జేరవేసే ఈ రాదారిబండ్లు ఆ గ్రామాలకు ప్రాణాధారాలే అవుతాయి. ఆ గ్రామ శిల్పిఅయిన వడ్రంగి, చేవ తిరిగిన మంచిరకపు కర్రతో నిర్మించిన బండి అలా దశాబ్దాలు పనిచేస్తూనే వుంటుంది. శాంతము, శక్తి మానవ సన్నిహితత్వమూ, మూర్తీభవించిన ఎద్దు వెంకటేశ్వరుని అవతారాలన్నా, బసవేశ్వరుని స్వరూపాలన్నా,ఆభావాలు మహా భావాలు కావా మరి !

చేననక, గట్టనక, ఏరనక, దారనక, నిదానంగా, నిశ్చలంగా, గంటలు, మువ్వలూ ప్రోగించుకుంటూ, యీ రాదారిబండ్లు తిరుగుతూనే వుంటాయి. భారతదేశమంతా యీ రెండెడ్ల బండ్లు నిండివున్నాయి కదా, పంజాబునుంచి కన్యాకుమారి వరకూ, ద్వారకనుండి గౌహతీవరకు కాడెడ్లబండ్లు భారతీయజీవితానికి పునాదియై దర్శన మిస్తాయి. ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క రీతియైన అందాన్ని కలిగి వుంటాయి. యీ బండ్లు. ఆకులుగల పెద్ద చక్రాలో, చిన్న చక్రాలో, ఆకులు లేని రాతి చక్రాలో, గట్టి కర్ర చక్రాలో, యీ బళ్ళు సాగుతూనే వున్నాయి. నైజాములో జనానా రెండెడ్ల పెట్టెబండ్లు వెదురు బద్దలతో వితానం కట్టిన బండ్లు, రథాలవలే నాలుగు చక్రాలు కలిగి ముందు రెండు చక్రాలు, ఎద్దులతోపాటు తిరుగుతూ, పైన గుడి శిఖరం వంటి శిఖరం కలిగిన, చిత్రమయిన బండ్లు ఉత్తరాదిని,తెలంగాణా, మరాటావాడలలో కనబడతాయి. ఆకాశం అంత ఎత్తు కలిగి, ఎద్దులు బండ్లు ఉత్తరాది బండ్లు. వాటికి తగిన ఎత్తుగల సింధీ ఎద్దులు. రాజపుత్ర స్థానంలో ఒంటెలే లాగుతాయి. ?గాడిలో చిన్న నందికేశ్వరునిలా పొట్టైన గిత్తలు గల చిన్న రెండెడ్లబండ్లు మహారాష్ట్రంలో జింక కొమ్ములవంటి అందమయిన నిడుపాటి కొమ్ములు కలిగి పరుగు తప్ప నడకే ఎరుగని పెనుగొండసీమ ఎద్దుల జత కలిగిన రాయలసీమ, మైసూరు బళ్ళు కొండఘాట్లు ఎక్కుతూ, దిగుతూ, నౌరంగపురం, జయపురం బండ్లు, యిలా దేశమంతా బండ్లు నిండివున్నాయి.

రాదారిబండి ఎంత అందమయినదో, ఆ బండిని లాగే ఎద్దులు ఎంత గంభీరంగా, సౌందర్యమూర్తులై వుంటాయో, అలాగే, ఆ బండికి సారథి అయిన ఆ పల్లెటూరి కోడెకాడు అంత ఠీవిగా, అంత హుషారుగా ఉంటాడు. కోర తల పాగా చుట్టుకుని, వెనక కుచ్చు వీపుమీద అల్లల్లాడ ఎగురుతూ, ఆటలాడుతూవుంటే పైన కుచ్చు కిరీటంమీద తురాయిలా, విడంబించివుంటే, మహారాజులాగే దర్శన మిస్తాడు అతను. మెళ్లో పులిగోరు తాడు, నాలుగు వెండి కాసులు, వుంటాయి. కండలు చుట్టిన దండల కడియాలు, బాహుపురులో, మొలలో వెండి గోవతాడో, బిళ్ళల మొలతాడో, ముంజేతులకు మురుగులు చేతిలో ముల్లుగోలు కమ్చీకర్రా, అతడు ప్రపంచమంతా రాజ్యం చేస్తూ కనపడ్డాడంటే అతిశయోక్తి ఏం వుంది ?

''హోరోరి బండివోడా,ఒగలమారి బండివోడా, ఆపవోయి నీ బండి, నిలుపవోయి నీ బండి'' అనే పాటతో ఏ వయ్యారి పడుచో అతనిపైన పువ్వులు జల్లేది. అతనికి ఎడ్లంటే ప్రాణం. వాటిని తన బిడ్డలకన్నా ఎక్కువగా చూస్తాడు. వాటికి పొద్దున్నే, చిట్టూ, తవుడూ, ఫులవలు పెడతాడు. స్వయంగా పచ్చిక అదీ కోసుకు వచ్చి బిడ్డలకు ఆరగింపచేసినట్లు వాటిని మేపుతాడు. పచ్చిగడ్డితోపాటు జనుముకట్ట, జొన్నదంటు, ఎండుగడ్డి వేస్తారు. వాటిని చెరువుకో, ఏటికో తీసుకువెళ్ళి దినదినమూ కడుగుతాడు.మంచినీళ్ళు త్రాగిస్తాడు. ముద్దైన పేర్లు పెట్టుకుంటాడు. రాముడు, లక్ష్మణుడు, వెంకటగిరి, సింహాచలం, నంది,భూంది,అని హృదయమారా పిలుచుకుంటూ ప్రయాణాలకూ, వాటినిఅలంకరించుకుంటాడు.

పూర్వకాలంలో దొంగలభయం వుండేచోట, దూరప్రయాణం అయినప్పుడు అడవిదారుల పులి, చిరుత, చితదున్న, క్రూరణాసిగుడ్లు, వేగులము, సంచరించే ప్రదేశాలలో వెళ్ళవలసి వచ్చినప్పుడు పది, పన్నెండు బళ్ళు జట్లుగా పోయేవాళ్ళు.బళ్ళకు వెనుకవైపు దిట్టమయిన జడీలు కట్టేవాళ్ళు. ప్రతి బండి ఒక చిన్న కోట. ప్రతి ఎద్దు ఒక యుద్ధ వీరుడు, కాశీ యాత్రకానీ, రామేశ్వర యాత్రగాని,యీ రాదారిబండ్లే సాగించేవి. వర్తకుల ఎగుమతి, దిగుమతి ప్రయాణాలు యీ రాదారిబండ్లు నిర్వహించేవి.

ఎన్నో కథలు పుట్టాయి ఈ రాదారి బండ్లను గురించి. నీతి చంద్రికలో, మిత్రభేదంలో సంజీవకము యీ దారిబండి ఎద్దే. మా వైపున ఒక కథ వుంది. ఒక పల్లెటూరి బాలిక నవయవ్వనంలో మిసమిసలాడుతున్న వలపుల వయ్యారిని, సొగసుల విహారినీ, ఆ అమ్మాయితండ్రి ఆ పడుచుకు యిష్టంలేని ఓ నడుమ వయస్సువానిని యివ్వదలచుకున్నాడట. ఆ పెండ్లికొడుకు కొమ్మమీద కోతిలా వికారమయిన అందం కలవాడట. ఆ వయ్యారిభామ అలాంటి పెళ్ళికొడుకు నాకు వద్దు అని వాళ్ళ అమ్మదగ్గర గోల పెట్టిందట. ఆ అమ్మాయికి బండితోలేవాళ్ళ బావంటే మహా యిష్టం. అతడు బండిని పొలానికి తోలుకు వెడుతుంటే ఎన్నిసార్లో తాను ఆ బండిమీద వెళ్ళేది. వూచబియ్యం తింటూ, పాటలు పాడుకుంటూ ఏదో, నిర్మలమయిన అమాయకమయిన వెంగళి మాటలతో ఉప్పొంగిపోయేవారు. పొలాలకి శృతి కలిపిన హాస్యాలూ, హాస్యాలలో తాళం కల్పిన నవ్వులు, వీటి అన్నింటితో సామ్యమయిన అకల్మష ప్రేమ వాళ్ళ బండిగంటలతో కలిసి వచ్చేది. పెళ్ళి రోజులు దగ్గరకు వస్తున్నాయి. ఈ పడుచు వాళ్ళ యిద్దరి మనస్సులూ కృంగిపోతున్నాయి. వీరిద్దరి సంగతిని గమనిస్తున్న వాళ్ళ అవ్వ వీరిద్దరికీ మద్దతు, ప్రోత్సాహం. ఓ రాత్రికి రాత్రి వీరిద్దరూ రాదారిబండెక్కి వుంతదారులూ, డొంకదారులూ ధాత్రి చుక్కల వెలుగులో వాళ్ళ అవ్వతో, యింకా యిద్దరి పెద్దలతో చిన్న తిరుపతి చేరుకున్నారు. శ్రీ వెంకటేశ్వరుని సన్నిధానములో వాళ్ళిద్దరూ భార్యా భర్తలై చక్కాపోయారు. తల్లిదండ్రులు ఈ రాదారిబండి ప్రయాణం, పెళ్ళి ఒప్పుకోక తప్పింది కాదు. కథ కంచికి వెళ్ళింది, మనం యింటికి వెళ్ళాం.

ఇలాంటి కదలు పల్లెటూరి ప్రపంచంలో ఎన్నో అడవిపువ్వులలాగా వికసించి వున్నాయి. ఆనాటి రోజులు మళ్ళీ వస్తాయా ! !

నేడు బస్సులు, రైళ్ళు వచ్చాయి. దిట్టమయిన కంకర రోడ్లునిర్మాణం అవుతున్నాయి. తెలంగాణాలోనో, రాయలసీమలోనో, మెరక వూళ్ళలోనో యిప్పటికీ రోడ్లులేనిచోట యీ రాదారిబండ్ల ప్రయాణాలు సాగుతూనే ఉన్నాయి

వేదకాలం నుంచీ రాదారిబండ్ల ప్రయాణం భారతదేశమంతా నిండివుంది. సంస్కృత సాహిత్యంలో, దేశభాషా సాహిత్యంలో, పద్యాలలో, పాటలలో, కథలలో, గాథలలో యీరాదారిబండ్ల ప్రయాణాలు ఎంతో మనోహరంగా వర్ణించారు పూర్వ కవులు. అజంతా చిత్రలేఖనంలో, అమరావతీ, భట్టిప్రోలు, నాగార్జునకొండ, మొదలైన శిల్పాలలో యీ రాదారి బండ్లు విన్యసింపబడి వున్నాయి. పల్లెటూరివారికి అవే నాలుగుగుర్రాలు పూన్చిన రథాలు. ఆ శిల్పాలలో నాలుగు, ఎనిమిది ఎద్దులు కట్టిన బళ్ళు వున్నాయి. రెండు మూడు కుటుంబాలు పట్టేటంత ఎడ్లబండ్లు వున్నాయి.

చిత్రకారుని హృదయానికీ, కొండఘాటి రాచబాటలలో, కొండ శిఖరాలు, చెరియలు, లోయలు, సెలయేళ్ళు, అడవులు చుట్టివున్న ప్రకృతి సౌందర్యము, ఆనందమూ, తాండవము చేసే ప్రదేశంలో ఒకటో, రెండో రాదారి బండ్లు ప్రయాణం చేస్తూంటే ఆ దృశ్యం, ఆ సౌందర్యానికి లావణ్యం కూర్చినట్లు అందమయిన పుష్పానికి తావి సమకూర్చినట్లు దర్శనమిస్తుంది.

పూర్వకాలం నుండి ఎంతమందో చిత్రకారులకు యీదృశ్యం విన్యసించటం ఎంతోఆనందం. తెల్ల వల్లని మబ్బులు కూడిన నీలాకాశం, ఆకాశంలోకి చొచ్చుకుపోయి పడగవిప్పి ఆడే పాములులా తాటిచెట్లు, ఆ చెట్లమధ్య ఆ పల్లెనాటి డొంకదారులు రెండెడ్లబండ్లు, ఆ వెనుక, దూర దూరంగా ఆ తోపులలో కోనేరు, గుడి, పల్లెటూరు..., ఎంత కళాపూర్ణం యీ భావం.

''తోలవోయి మన బండి, త్రోవ దూర మెటనుండో, ఎటనుండో సాగె దారి ఏ దూర విడిది చేరు రాదారై.''

**(రేడియోప్రసంగం మదరాసు)**